క్లుప్తంగా

పార్టీని బలోపేతం చేయాలి



మాజీ ఎంపీ సోయం బాపురావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇచ్చోడ: స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని మాజీ ఎంపీ సోయం బాపురావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన్ను మంగళవారం ఇచ్చోడ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామీణప్రాంత ప్రజలకు వివరించాలన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూం పేరిట ప్రజలను మభ్యపెట్టారన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కల్లెం నారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్ కుంర సత్యవతి కోటేశ్, ముస్తాఫా, అక్కెపెల్లి లక్ష్మణ్, మహిబూబ్, రషీద్ తదితరులు ఉన్నారు.

సోయం బాపూరావుకు సన్మానం

బోథ్: రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎంపీ సోయం బాపూరావును సొనాల మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. వచ్చేనెల 27న సోయం బాపూరావు ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బోథ్ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ చైర్మన్ రాజుయాదవ్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్, సొనాల పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకులు గాజుల పోతన్న, కసిరె పోతన్న, శ్రీధర్ ముండే, అబుద్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: త్వరలోనే కామాగిరి గ్రామాన్ని సందర్శించి అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని కామాగిరి గ్రామస్తులు మంగళవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తానే గ్రామాన్ని సందర్శించి అక్కడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మహేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, రమణారెడ్డి, పోతారెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

తాంసిలో ప్రజావాణి

తాంసి: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి సీపీవో వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 4వ విడత పైలెట్ ప్రాజెక్టు ప్రజా ఫిర్యాదుల బహిరంగ విచారణ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో పలువురి దరఖాస్తులను పరిశీలించి కొన్ని పరిష్కరించారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

ఆదిలాబాద్‌టౌన్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 170 కాలనీ, న్యూహౌజింగ్ బోర్డు సమీపంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న కుటుంబ సభ్యుల సర్వే నిర్వహించారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. షూర్ ఎన్జీఓ కో ఆర్డినేటర్ వినోద్, చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, అవుట్‌రీచ్ వర్కర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

నేరడిగొండ: ధర్తి ఆబ జన్‌భాగిదారి అభియాన్‌లో భాగంగా మండలంలోని రాజుర, లింగట్ల గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. అనంతరం వైద్యసిబ్బంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీవో లక్ష్మణ్, హెచ్‌ఈవో పవార్ రవీందర్, ఎస్‌సీఆర్పీ ప్రకాశ్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. మండలంలోని శివ్‌ఘాట్ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు.

ప్రజా మరుగుదొడ్లు లేవు

- తాంసిలో సులభ్ కాంప్లెక్స్ లేక ఇబ్బందులు
- గ్రామాల నుంచి పనినిమిత్తం వచ్చే ప్రజలు ఇక్కట్లు
- అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో బ్యాంక్ వద్ద చెట్ల కింద సేదతీరుతున్న గ్రామాల ప్రజలు

తాంసి: మండల కేంద్రంలో ప్రజావసరాలు, అందులో అత్యవసరాలు తీర్చే మౌలిక సదుపాయాలైన ప్రజా మరుగుదొడ్లు లేవు. ఇతర గ్రామాల నుంచి ప్రజలు ప్రభుత్వ కార్యాలయానికి, వివిధ పని నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. ఇక్కడ ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. మహిళల బాధలు వర్ణనాతీతం. పురుషులు ఖాళీస్థలాలు, చెట్లపొదల మాటున ఒంటికి వెళ్తున్నారు. తాంసిలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మహిళలు అత్యవసర పరిస్థితిలో అవస్థలు తప్పడం లేదు. సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని స్థానికులు అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నా పట్టించుకోవడం లేదు.

అవసరాలు గుర్తించక..

మండల కేంద్రంలో రెవెన్యూ, మండల పరిషత్, సొసైటీ, ఐకేపీ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, ఎస్బీఐ బ్యాంకులు తదితర ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వాణిజ్యపరమైన అవసరాల కోసం గ్రామాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు తప్పించి బయటవారికి ఎక్కడ మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. గ్రామాల నుంచి ఐకేపీ, బ్యాంకులకు వచ్చే డ్వాక్రా గ్రూప్ మహిళలు గంటల తరబడి పని కోసం వేచిచూడాల్సిన పరిస్థితి. ఆ సమయంలో అత్యవసరాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రానికి వచ్చే ప్రజల కనీస అవసరాలను అధికారులు గుర్తించకపోవడంతో వారికి అవస్థలు తప్పడం లేదు.

మహిళలకు తప్పని ఇబ్బందులు

వివిధ పనుల మండల కేంద్రానికి వచ్చే మహిళలకు ప్రజామరుగుదొడ్లు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో తమ పని పూర్తయ్యే వరకు ఓపికతో ఉండాల్సిన పరిస్థితి. దీంతో మహిళలకు ఆరోగ్య సమస్యలు సైతం తలెత్తే అవకాశం ఉంది. పురుషులు ఖాళీ స్థలాల్లో చెట్లమాటున మూత్రవిసర్జనతో పలుచోట్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో స్థలాన్ని గుర్తించి సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మండల కేంద్రానికి వివిధ పని నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యం కోసం సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి. ప్రతీరోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మిస్తే వారి ఇబ్బందులు తొలగుతాయి.
– రేణి రాములు, తాంసి

పట్టించుకోలేదు



ప్రజామరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు ఇదివరకే వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు అందజేస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణం చేపట్టడం లేదు. ఒంటికి, రెంటికి మహిళలు, పురుషులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణంపై త్వరగా దృష్టిసారించాలి. – నగరం అశోక్ కుమార్, తాంసి

పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్, ఉట్నూరు డిపోల నుంచి పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీస్‌లను ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ నుంచి పొచ్చర జలపాతం, సహస్ర కుండ్, మాహోర్, ఉనికేశ్వర్ వంటి పర్యాటక ప్రదేశాలకు ఈనెల 28నుంచి స్పెషల్ సర్వీస్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ సర్వీస్ ఉదయం 7 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు తిరిగి ఆదిలాబాద్ చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ.510, పిల్లలకు రూ.205 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపా రు. రిజర్వేషన్ సౌకర్యం సైతం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో లేదా ఆదిలాబాద్ బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఉట్నూరు నుంచి కాళేశ్వరం, వేములవాడ, కొండగట్టు ప్రాంతాలకు ఈనెల 28న స్పెషల్ సర్వీస్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వీస్ ఉదయం 5 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటలకు తిరిగి ఉట్నూర్ చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ. 620, పిల్లలకు రూ.320 చార్జీ ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఈ ప్రత్యేక టూరిస్ట్ ప్యాకేజీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 26న మెగా ఫార్మా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సంగీత, కెరీర్ గైడెన్స్ సమన్వయకర్తలు మంజూల, శ్రీధరదేవి ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల వారు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ మేళాలో అరబిందో ఫార్మా, బయోకాన్, భారత్ బయోటెక్, ఎటీరో ల్యాబ్ తదితర కంపెనీలు పాల్గొంటాయని, ఎంపికైన వారిని హైదరాబాద్‌లో నాలుగు నెలలు శిక్షణ కల్పించి ఉద్యోగాలు ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఆరుగురి బైండోవర్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈనెల 22న పేకాడుతూ పట్టుబడ్డ ఆరుగురిని ఆదిలాబాద్‌అర్బన్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. బైండోవర్ అయిన వారిలో షేక్ తౌఫిక్, సయ్యద్ ఫైసల్, షేక్ వసీమ్, అఫ్రోజ్ ఖాన్, జాహిద్ ఔష్, షేక్ నజీమ్ ఉన్నట్లు పేర్కొన్నారు.

పాత నేరస్తుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో చోరీలకు పాల్పడిన నిందితుడు షేక్ అయాన్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చాడేశ్వరి మాతా ఆలయం, మహాలక్ష్మివాడలోని ఓ ఇంట్లో చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

టీజీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ ధారావత్ గిర్మోజి కోరారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బ్యాంకు సేవలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిపాజిట్ల స్వీకరణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివిధ పథకాల గురించి వివరించారు. చీఫ్ మేనేజర్ వెంకటస్వామి, పలు బ్రాంచ్‌ల మేనేజర్లు ప్రసన్నకుమార్, అప్పారావు, మధుసూదన్, రాహుల్, విష్ణు, కిరణ్‌రెడ్డి, రమణారెడ్డి, అనీస్ తదితరులు పాల్గొన్నారు.

‘సహజ వనరుల దోపిడీకే దాడులు’



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: ఇరాన్‌లోని సహజ వనరులు, సంపదను దోచుకునేందుకు అమెరికా దాడులు మొదలు పెట్టిందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఆరోపించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల జాతీయ రహదారిపై వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం అమెరికా, ఇజ్రాయెల్ ప్రభుత్వాల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించాలన్నారు. సామ్రాజ్యవాద యుద్ధకాంక్ష మూలంగానే ఇరాన్‌పై అమెరికా ఈ దుస్సాహసానికి పాల్పడుతుందని విమర్శించారు. అమెరికా వెంటనే దాడుల్ని ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లంక రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, సురేందర్ మంజుల, అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, పండుగ పొచ్చన్న , గంగారం, గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

తాంసి: జామిడి గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగుడు సాయికుమార్‌కి సామాజిక కార్యకర్త ముదుపు మౌనిష్‌రెడ్డి మంగళవారం వీల్‌చైర్ అందించాడు. రెండునెలల క్రితం దేవమ్మ ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోగా నిత్యావసరాలు అందజేశాడు. ఆమె కుమారుడు దివ్యాంగుడైన సాయికుమార్‌కు వీల్‌చైర్ అందజేశాడు. గ్రామస్తులు ఉన్నారు.

మినీ హజ్ హౌజ్ పనులు వేగవంతం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో మినీ హజ్ హౌజ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మాణం కోసం నిధులు ఉన్నప్పటికీ పలు కారణాలతో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. రాష్ట్ర షెడ్యూల్, మైనార్టీ వ్యవహారాల సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ విషయంపై దృష్టిసారించాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలంలోని 38 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సాయిమహేశ్, అధికారులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

నేరడిగొండ: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన సాగిస్తుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు పోతారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, నారాయణరెడ్డి, మురళీగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పీఎం జన్‌మన్

ఇచ్చోడ: గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని గేర్జంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. సామాజిక ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్ఐ హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి

బోథ్: గ్రామసంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని రాష్ట్ర సీఆర్పీ కవిత, రషీద అన్నారు. మండల కేంద్రంలోని మహిళా స్త్రీశక్తి భవనంలో పతాధికారుల శిక్షణలో మంగళవారం పాల్గొన్నారు. విధులు, బాధ్యతలు గ్రామ సంఘాల పనితీరు, లావాదేవీలు, కమిటీల ఏర్పాటు, గ్రామ సంఘాల పర్యవేక్షణ తదితరవాటిపై శిక్షణ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో మంగళవారం ఆయన పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలను కాలనీవాసులకు వివరించారు. అనంతరం పూలకుండీల్లో నీటిలో దోమల లార్వా ఉన్న వాటిని గుర్తించి పారబోశారు.

ట్రిపుల్‌ఐటీలో సీటు

బోథ్: సొనాల మండలం గుట్టపక్కతండా గ్రామానికి చెందిన విలాస్‌సింగ్, కవిత దంపతుల కుమారుడు చౌహాన్ శ్రీకాంత్ శ్రీకాకుళంలోని ట్రిపుల్‌ఐటీలో సీటు సంపాదించాడు. తండ్రి విలాస్ ఓ పెట్రోల్ పంప్‌లో పని చేస్తుండగా, తల్లి కవిత ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. కాగా, శ్రీకాంత్ సోదరుడు చౌహాన్ సచిన్ గతంలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, ప్రస్తుతం బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా, శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి

బోథ్: తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని, వారి డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ సుభాష్‌చందర్‌కు వినతిపత్రం అందించారు. ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. రూ. 25 వేల పెన్షన్‌ను అందజేయాలని కోరారు. పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన ఉండాలని సైబర్ క్రైం కానిస్టేబుల్ ప్రశాంత్, సీనియర్ సిటిజన్ సంస్థ అధ్యక్షుడు దేవిదాస్ దేశ్ పాండే అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం, వెంకట్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాణి దుర్గావతి వర్ధంతి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సిరిచెల్మ రోడ్డులో రాణిదుర్గావతి వర్ధంతిని మంగళవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాణిదుర్గావతి చౌక్ వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుడుందెబ్బ బోథ్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్, నాయకులు మురళీకృష్ణ, భీముడు, జగపతి పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

తాంసి: రైతులకు యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచేలా చూడాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఏవో రవీందర్, తహసీల్దార్ లక్ష్మికి మంగళవారం రైతులతో కలిసి వినతిపత్రం అందించారు.



తాంసి: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మావల రైతు వేదిక వద్ద క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



నేరడిగొండలో..



సాత్నాల: మేడిగూడలో..

రైతుభరోసా సంబరాలు

తలమడుగు/ఆదిలాబాద్‌రూరల్/సాత్నాల/తాంసి/నేరడిగొండ/ఇంద్రవెల్లి/సిరికొండ/బేల/జైనథ్/నార్నూర్/బోథ్: అన్నదాతలకు అండగా నిలుస్తూ రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా నిధులు వారి ఖాతాల్లో జమచేయడంపై జిల్లాలో కాంగ్రెస్ నేతలు మంగళవారం సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్ ఫ్లెక్సీలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోయం అవినాష్, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు పోతారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, తహసీల్దార్లు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



తలమడుగు: క్షీరాభిషేకం చేస్తూ..



నేరడిగొండ: రైతు చేనులో ..



బేల: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వసతిగృహాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్



కొలాం ఆశ్రమ పాఠశాలలోని గదులను పరిశీలిస్తున్న విశారదన్ మహారాజ్

ఆదిలాబాద్‌రూరల్: పాఠశాలలు, వసతి గృహాల్లో అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ అన్నారు. లక్ష కిలోమీటర్ల మా భూమి యాత్రలో భాగంగా జిల్లాకేంద్రంలోని కొలాం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల భోజనం, డైనింగ్ హాల్, నిద్రపోయే గది, వంట గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ పిల్లల ఉన్నతవిద్య కోసం గిరిజన కళాశాలతోపాటు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి అస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో పాఠశాలలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల అభివృద్ధికి రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు నిధులు మంజూరు చేయాలన్నారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహారాజ్, ఉపాధ్యక్షురాలు సుష్మ, రామచందర్, సురేశ్, శ్రీవాణి, సవిత, రాకేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా



ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోథ్: ఆదివాసీ గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ నగేశ్ తెలిపారు. సొనాల మండలంలోని కేశవ్‌గూడ, లెండిగూడ, మహదుగూడ, నాగుగూడ, జైతుగూడ గ్రామాలను మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చింతలబోరిలో ఎంపీని గ్రామస్తులు సన్మానించారు. మండల అధ్యక్షులు రవీందర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాజు, మాజీ రైల్వేబోర్డు మెంబర్ జీవీ రమణ, చంద్రకాంత్, శంకర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బోథ్: సొనాల మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించారు. ఆదివాసీ గ్రామాల్లో సిగ్నల్స్ లేక లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లోకి వెళ్లి రేషన్ సరుకులు తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలపై విన్నవించారు. నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా జిలా కన్వీనర్ బత్తుల రమేశ్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థినికి సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో 1000కి గాను 990 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన విద్యార్థిని అమీనా శిరీన్‌ను కలెక్టర్ రాజర్షి షా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.